జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..


జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

మంగళవారం | 29-10-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 148 పేజీలు: 8 వెల : రూ.7

# ఇచ్ఛాపురం నుంచే.. సూపర్ సిక్స్



**కంచిలి/శ్రీకాకుళం, అక్టోబర్ 28 (వార్త):** మొన్నటి సార్వత్రిక ఎన్నికల హామీలో భాగంగా మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ అమలకు సంబంధించి దీపావళి కానుకగా మహిళలకు అందిస్తున్న ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ ఆరంభ కార్యక్రమానికి మన నియోజకవర్గమే వేదిక కానుంది. ఈ మేరకు సీఎ%శీ%ఓ కార్యాలయం నుంచి ఆదివారం రాత్రి జిల్లా అధికారులకు ఆదేశాలు అందాయి. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి ఇంచార్జ్ ఆర్డిఓ తో కలిసి స్థానిక శాసనసభ్యులు డాక్టర్ బెందాళం అశోక్ బాబు సోంపేట మండలంలోని కొర్లాం, కంచిలి మండలంలోని పద్మతుల గ్రామ పరిసరాలను పరిశీలించారు. సోమవారం మధ్యాహ్నం నుంచి, ముఖ్యమంత్రి కార్యక్రమానికి సంబంధించి హెలిప్యాడ్, సభాస్థలి, లబ్ధిదారుల ఎంపిక వంటి అంశాలపై క్షేత్రస్థాయిలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పండ్కర్, ఎస్పీ కె.వి మహేశ్వర రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ తో కలిసి స్థానిక ఎమ్మెల్యే అశోక్ బాబు సాయంత్రం నాలుగు గంటల వరకు సోంపేట, ఇచ్ఛాపురం, కంచిలి మండలాలలో కొర్లాం, ఈదుపురం, పద్మ తుల గ్రామాలను సందర్శించారు.

## తొలి సిక్స్ ఇక్కడి నుంచి కావడంతో...

ముఖ్యమంత్రి కార్యక్రమానికి వేదిక ఎంపిక, కార్యక్రమ నిర్వహణ, అధికారులకు స్థానిక శాసనసభ్యునికి ప్రతిష్టాత్మకంగా మారింది. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తరువాత తొలిసారి జిల్లాకు చంద్రబాబు వస్తున్నారు. అందులోనూ, సూపర్ సిక్స్ అమలు వంటి కార్యక్రమం ప్రారంభోత్సవ అవకాశం ఇచ్ఛాపురం నియోజకవర్గానికి రావడం చాలా బాధ్యతగా అధికారులు, శాసనసభ్యులు భావిస్తున్నారు. ఎన్.ఎస్.జి సెక్యూరిటీలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు సెక్యూరిటీ నిబంధనలు కూడా సవాల్ గా ఉన్నాయి. కార్యక్రమ ప్రణాళికలో భాగంగా, నలుగురు లబ్ధిదారుల గృహాలకు వెళ్లి ముఖ్యమంత్రి మాట్లాడతారు. వెళ్లే దారి నుంచి వెనక్కి తిరిగి రాకుండా సభాస్థలి వద్దకి చేరుకోవాలి. అక్కడ ఆ గ్రామానికి సంబంధించి పౌరులతో గ్రామసభ నిర్వహిస్తారు. వెళ్లే దారి, వచ్చే దారి వేర్వేరుగా ఉండాల్సిన అవసరం ఉంది. ఒకవైపు పబ్లిక్, మరోవైపు కూటమి నేతల తాకిడి నుంచి ఇటు లబ్ధిదారులకు, అటు ముఖ్యమంత్రికి అసౌకర్యం లేకుండా కార్యక్రమం నిర్వహణ జరగాలి. ఈ అంశాలు అన్నింటిని వడపోస్తూ గ్రామాన్ని ఎంపిక చేయడం జరుగుతోంది.

## కొర్లాం నుంచి ఈదుపురం... తిరిగి కంచిలి

కొర్లం జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న అనువైన ప్రదేశాలను మధ్యాహ్నం కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే పరిశీలన చేశారు. అక్కడ పరిస్థితులు అంత అనుకూలంగా లేకపోవడంతో నేరుగా ఈదుపురం వెళ్లారు. ఈదుపురంలో ముఖ్యమంత్రి పర్యటనకు గల అంశాలను పరిశీలించి అక్కడ నుంచి మళ్లీ కంచిలి మండలం పద్మతుల గ్రామాన్ని సందర్శించారు. మకరాంపురం వద్ద గతంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామమంతా కలయ తిరుగుతూ.. కార్యక్రమ నిర్వహణకు అనుకూలమైనటువంటి అంశాలను శోధించారు. అన్ని ప్రదేశాలను పరిశీలన చేసినప్పటికీ, ఈదుపురం లేదా పద్మతులా అనే విషయమై అనేది స్పష్టం చేయలేదు. పరిశీలన చేసిన ప్రాంతాలు అన్నింటిలో కార్యక్రమం నిర్వహణకు అణువుగా ఉండే ప్రదేశాన్ని ఎమ్మెల్యేకే అప్పచెప్పారు. రేపటికల్లా ఒక గ్రామాన్ని ఫైనల్ చేయాలని కలెక్టర్ ఎమ్మెల్యే అశోక్ బాబుకు సూచించారు.

## తెలుగుదేశం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం

ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమం రాష్ట్రానికి ఈశాన్యంలో ఉన్న ఇచ్ఛాపురం నియోజకవర్గం నుంచి ప్రారంభించాలని ఎమ్మెల్యే సూచన మేరకు ప్రభుత్వం ఏర్పడిన 100 రోజుల కార్యక్రమం మన నియోజకవర్గానికి ఖాయం అయ్యింది. అయితే ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో, రాజపురం వద్ద తలపెట్టాల్సిన ఆ కార్యక్రమం అనూహ్యంగా రద్దయింది. ఒక్క రోజులోనే యుద్ధ ప్రాతిపదికన కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం, కూటమి నేతలు చివరి నిమిషంలో నిరాశపడ్డారు. అంతలోనే, ప్రతిష్టాత్మకమైనటువంటి సూపర్ సిక్స్ లోని దీపం పథకం మన నియోజకవర్గం నుంచి ప్రారంభోత్సవ అవకాశం రావడం తెదేపాశ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. తమ అభిమాన నేత చంద్రబాబు నాయుడు, ప్రియతమ నేత అశోక్ బాబు నిర్వహణలో సూపర్ సిక్స్ హామీ తొలి కార్యక్రమం నియోజకవర్గానికి దక్కుతుండడంపై కూటమి నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమాలలో అధికారులు, ఎమ్మెల్యే తో పాటు సోంపేట మాజీ ఎంపీపీ చిత్రాడ శ్రీనివాస్, జగదీష్ పట్నాయక్, బంగారు కురయ్య, తమరాల శోభన్ బాబు, మదిన రామారావు, పైలా పురుషోత్తం బ్రదర్స్, సూర్యనారాయణ రెడ్డి, కురయ్యా, కంచిలి ఎమ్మార్వో రమేష్, ఎంపీడీవో తిరుమలరావు, ఎంఈఓ శివరాం ప్రసాద్, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

- ఈదుపురమా... పద్మతుల..??
- ఉచిత సిలిండర్ల పంపిణీ మన దగ్గర నుంచి..
- నవంబర్ 1 న నియోజకవర్గానికి ముఖ్యమంత్రి రాక
- ప్రమాణ స్వీకారం తర్వాత తొలిసారి
- ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే
- ఆదివారం రాత్రి నుంచి పలు ప్రాంతాల సందర్శన
- కంచిలిలో వేచి చూసిన యంత్రాంగం, నేతలు
- వాహనాలు నిలుపు చేయకుండా వెళ్లిన అధికారులు
- పద్మతుల, ఈదుపురం గ్రామాల్లో నిర్వహణపై చర్చ
- రెండు చోట్ల స్థల పరిశీలన చేసిన అధికారులు
- లబ్ధిదారుల ఇళ్ల ఎంపిక, సెక్యూరిటీ పై కుస్తీ
- రేపటికి ఫైనల్ కానున్న వేదిక
- సాయంత్రం 4 గంటల వరకు స్థల పరిశీలన







జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## వెంకన్న హుండీ ఆదాయం రూ.1.94 లక్షలు

**జలుమూరు, అక్టోబర్ 28(వార్త):** నరసన్నపేటలోని వేంకటేశ్వర స్వామి ఆలయ హుండీ లెక్కింపు కార్యక్రమం సోమవారం నిర్వహించామని ఆలయ ఈవో రవి కుమార్ తెలిపారు. హుండీ ఆదాయం రూ.1.94 లక్షలు వచ్చిందన్నారు. కార్యక్ర మంలో ఆలయ ధర్మకర్త వీరభద్రస్వామి, ఆలయ అర్చకులు సాయి కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.



# తోటపల్లి నీరు రాక రైతుల వర్రీ

**-ఎండిపోతున్న పంట**
**-ఆందోళనలో రైతాంగం**



**వంగర, అక్టోబర్ 28(వార్త):** వంగర మండలంలోని తోటపల్లి కుడి కాలువ ద్వారా సాగునీరు అందక వరి పంట చేలు ఎండిపోతున్నాయి. ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంటలు కళ్ల ముందే ఎండుతుంటే రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. సాగునీరు లేక దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. వంగర మండలంలోని మద్దివలస, తలగాం, కొత్తవలస, ఎం.సీతారాంపురం, శివ్వాం, వంగర, బంగారువలస, కొప్పరవలస, కొప్పర తదితర గ్రామాల్లో సుమారుగా మూడు వేల ఎకరాల్లో వరి పంట పొలాలు ఎండిపోతున్నాయి. ఈ గ్రామాలన్నీ పేరుకే తోటపల్లి పాతబ్యారేజ్ కుడి కాల్వ ఆయకట్టు పంట భూములని చెప్పుకోవడానికే తప్ప, కాల్వ ద్వారా సాగునీరు అందక పంటలు నీటి కోసం ఎదురు చూస్తున్నాయి. కొన్ని నెలలుగా సాగు నీరు సరఫరా నిలిచిపోయింది. సాగు నీరు అందించడానికి తోటపల్లి కుడి కాల్వ ఇంజనీరింగ్ అధికారులు ముందుకు రావడం లేదని ఆయకట్టు రైతులు మండిపడుతున్నారు. వరి పంట పొలాలు పొట్ట దశలో పూర్తిగా ఎండిపోతుండడంతో పశువులకు మేతగా వదిలేయాల్సిన పరిస్థితి ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పొట్ట దశకు వచ్చిన పంట చేతికి అందకుండా పోతున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత్యంతరం లేక ఏమీ చేయలేకపోతున్నామని రైతులు వాపోతున్నారు. ఎండుతున్న చేలను ఏదోలా కాపాడుకోవాలన్నా, అందుబాటులో నీరు లేదని రైతుల భోరున విలపిస్తున్నారు. కొద్దిగా నైనా పంటను కాపాడుకుందామని ప్రయత్నిస్తున్నా ఫలితం లేకపోవడంతో సాగు రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. తోటపల్లి కుడి కాల్వ ద్వారా నీరు సరఫరా చేయడం లో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. గతంలో ఎన్నడూలేనివిధంగా ఆయకట్టు పొలాలకు సాగు నీరు అందించడంలో అధికారుల నిర్లక్ష్యం ప్రస్ఫుటంగా కనిపిస్తోందని రైతులు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఇప్పటికైనా సంబంధిత యంత్రాంగం చర్యలు చేపట్టి చివరి దశలో ఉన్న వరి పంటలకు నీరందించేలా చూడాలని రైతన్నలు కోరుతున్నారు.

# 'మాతృశాఖలో విలీనం చేయండి'



**మెళియాపుట్టి, అక్టోబర్ 28(వార్త):** వేర్వేరు విభాగాల్లో పనిచేస్తున్న తమను మాతృశాఖ ఉద్యాన శాఖలో విలీనం చేయాలని గ్రామ ఉద్యాన అసోసియేషన్ సభ్యులు కోరుతున్నారు. హార్టికల్చరులో రేషన్‌లైజేషన్ చేసి క్లస్టర్ విధానం అమలు చేయాలని, హార్టికల్చర్ అసిస్టెంట్లకు రెండో విడతగా 661 మందికి హెచ్‌ఈవో పదోన్నతులు కల్పించాలనే డిమాండ్లతో కూడిన విజ్ఞాపన పత్రాన్ని సోమవారం వారు జిల్లా ఉద్యానవన శాఖ అధికారులకు కలిసి అందించారు. రాష్ట్రంలో ఉద్యాన పంటలు 18.23 లక్షల హెక్టార్లలో సాగు చేసి 366.49 లక్షల మెట్రిక్ టన్నులు ఉత్పత్తి జరుగుతోందని, పండ్ల ఉత్పత్తిలో మన రాష్ట్ర మొదటి స్థానంలో ఉందన్నారు. ఆయిల్ ఫామ్, బొప్పాయి, కోకో, నిమ్మ, టమోటో, కొబ్బరి, మిరప పంటల ఉత్పాదకతలో రాష్ట్రం దేశంలోనే మొదటి స్థానంలో ఉందని, మామిడి, బత్తాయి, పసుపు పంటల ఉత్పాదకతలో దేశంలోనే రెండో స్థానంలో ఉన్నామని, డ్రిప్పు స్ప్రింక్లర్ పరికరాల సరఫరాలో దేశంలో నాలుగో స్థానం కాగా ఉద్యాన రంగంలో మన రాష్ట్ర మంచి ప్రగతి పథంలో ఉందన్నారు. దీంతో ఉపాధి వృద్ధితో పాటు రైతుల ఆదాయం వారి జీవన ప్రమాణాలు కూడా పెరుగుతున్నాయన్నారు. ఉద్యాన రంగంలో పంటల విస్తీర్ణం కూడా పెరుగుతూ ఉందని, రాష్ట్రంలో ఉద్యాన శాఖలో అర కొర నిధులు, సిబ్బంది లేమితో సతమతమవుతూ నిర్లక్ష్యానికి గురైందని, ఇటువంటి నేపథ్యంలో రైతులకు మంచి సేవలు అందించాలన్న మరింత ప్రగతి సాధించాలన్న రైతన్నకు ఆదాయం రెట్టింపు కావాలన్నా దేశానికి ఆదర్శంగా నిలవాలన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఉద్యాన హబ్ చేయాలన్నా మన ముఖ్యమంత్రి చంద్రబాబు కల నెరవేరాలన్నా ప్రభుత్వం ఉద్యాన శాఖపై దృష్టి సారించి తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని వారు విన్నవిస్తున్నారు. గ్రామ స్థాయిలో పనిచేస్తున్న ఉద్యాన సహాయకులను ఉద్యాన శాఖకు కేటాయించి సచివాలయ వ్యవస్థకు సంబంధం లేకుండా ఉద్యాన అధికారి పర్యవేక్షణలో పనిచేసే వీలు కల్పించాలని కోరారు. గతంలో పనిచేసిన ఎంపీఈవోల మాదిరిగా ఆ మండలంలోని ఉద్యాన పంటల విస్తీర్ణాన్ని బట్టి మండలానికి నలుగురు క్లస్టర్ పరిధి పనిచేసే విధంగా అవకాశం కల్పించాలన్నారు. ఉద్యాన సహాయకులు 2429 మంది గ్రామస్థాయిలో విధులు నిర్వర్తిస్తున్నామని, గ్రామ ఉద్యాన సహాయకులైన తమను మాతృ శాఖ ఉద్యాన శాఖ లో ప్రత్యక్షంగా పనిచేసేటట్లు చర్యలు చేపట్టాలని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

ఉద్యాన శాఖ అధికారి శంకర్‌దాస్‌ను కలిసిన వారిలో ఉద్యాన సహాయకులు శరత్‌కుమార్ రెడ్డి, త్రినాథరావు, పవన్, సంతోష్ రెడ్డి, అవినాష్, ప్రశాంత్, స్వాగత, రాంబాబు, లావణ్య, హార్టికల్చర్ అసిస్టెంట్లు తదితరులు ఉన్నారు.

# అడవులను కొల్లగొట్టడానికి కేంద్రం యత్నాలు

**మందస, అక్టోబర్ 28(వార్త):** ఆదివాసీలకు స్వయం పాలనాధికారాలు లేకపోతే అడవులకు రక్షణ కరువవుతుందని, సరిహద్దు రక్షణ పేరిట అడవులను కొల్లగొట్టడానికి కేంద్రం ప్రయత్నాలు చేస్తోందని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర కోశాధికారి కోనేరు రమేష్ ధ్వజమెత్తారు. మందసలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఆదివాసీలకు స్వయం పాలనా అధికారాలు లేకుండా అడవులు రక్షించుకోలేమన్నారు. దేశంలోని సహజ అడవులను వ్యాపార అవసరాల కోసం చట్టాలు చేసి, ఆదివాసులను అడవికి దూరం చేయడం తెల్ల దొరలతోనే మొదలైందని, 200 సంవత్సరాల పాటు దేశంలో తెల్లోడికి వ్యతిరేకంగా నిజమైన పోరాటాలు గిరిజనులే చేశారని, ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం గర్వంగా చెప్పగలగుతోందన్నారు. ఈ స్ఫూర్తితో వన్ ఆఫ్ సెవెంటీ (1/70) చట్టాన్ని కాపాడుకుంటూ "జల్ జంగల్ జమీన్"లపై అధికారానికై పోరాడుతుందన్నారు. ప్రస్తుతం సరికొత్త చట్ట సవరణతో ఈశాన్య రాష్ట్రాల్లో అమల్లో ఉన్న 6వ షెడ్యూల్‌ను నామ మాత్రం చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. మణిపూర్‌లో మైతీలకు ఎస్టీ హోదా ఇవ్వడం ద్వారా అడవులను అడ్డగోలుగా కొల్లగొట్టే ప్రయత్నం బెడిసి కొట్టడంతో తాజా చట్టంలో అడవులన్నీ సరిహద్దు రక్షణ పేరిట కేంద్రం కొల్లగొట్టడానికి ప్రయత్నిస్తుందన్నారు. అడవులను, అడవి గర్భంలో విలువైన ఖనిజాలను కొల్లగొట్టడానికి తాజా చట్టం అవకాశం కల్పిస్తుందన్నారు. మణిపూర్ హింసాకాండపై జరుగుతున్న ఆందోళనతో పార్లమెంటు అట్టుడుగుతుండగా "సందట్లో సడేమియా"లా ప్రభుత్వం ఫారెస్ట్ రక్షణ (సవరణ )చట్టం 2023ను ఆమోదించుకుందన్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తూ ఐక్య ఆందోళనతో చట్టాన్ని వెనక్కు తిప్పి కొడదామని మా సంఘం తరపున ప్రకటిస్తున్నామన్నారు. 5వ షెడ్యూల్ కింద మన ప్రాంతాల్లోనూ పెసా చట్టం అమలకు ఆదివాసీ గూడేలకు సంపూర్ణ అధికారాలు ఉండాలని పోరాడుదామని పిలుపునిచ్చారు. ప్రత్యేకించి మన ఆంధ్రప్రదేశ్‌లో అడవి అంతటా విస్తరించి ఉన్న వివిధ ఆదివాసీ తెగల హక్కుల కోసం సమిష్టిగా పోరాడుదామని ప్రతిపాదిస్తున్నామన్నారు. పోడు భూములకు పట్టాలు, ఇతర మౌలిక వసతుల కల్పనకు జోడించి, నూతన అటవీ రక్షణ సవరణ చట్టం రద్దుకై పోరాడుదామన్నారు. ఆదివాసీ యూనివర్సిటీలు నెలకొల్పి బ్యాక్‌లాగ్ పోస్టులన్నీ భర్తీ చేయాలని, భూ పంపిణీ, ఉద్యోగకల్పన, సబ్ ప్లాన్ నిధులు, ఉద్యోగాలు, రాజకీయ పదవుల్లో ఆనాది తెగలకు ప్రాధాన్యం ఇవ్వాలని రమేష్ డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న ఏపీఆర్సీఎస్ రాష్ట్ర కోశాధికారి రమేష్



## టీడీపీలో చేరిన వైసీపీ ప్రతినిధులు

**పోలాకి, అక్టోబర్ 28(వార్త):** తెలుగుదేశం పార్టీ ప్రజాకర్షణ నేపథ్యంలో వైసీపీ నేతలు పలువురు ఆ పార్టీలో చేరారు. పోలాకి మండలం కత్తిరివానిపేటలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి సమక్షంలో నరసన్నపేట పెద్దపేట వీధి నుంచి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు టీడీపీ కండువా ధరించారు. పార్టీలో చేరిన వారిలో వైశ్యరాజు జయరాజ్, వైశ్యరాజు సాంబమూర్తి రాజు, కిల్లంశెట్టి వెంకట రమణమూర్తి తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి గొద్దు చిట్టిబాబు, కింజరాపు రామారావు, బోయిన సతీష్‌కుమార్, సరిపల్లి మధు, ఉప సర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబు, పొట్నూరు నరసింహమూర్తి, దొడ్ల మల్లేశ్వరరావు, కేలం చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



## వికలాంగుల సమస్యలు పరిష్కరించండి

**జలుమూరు, అక్టోబర్ 28(వార్త):** కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, నరసన్నపేట శాసనసభ్యుడు బగ్గు రమణమూర్తికి తమ సమస్యలపై వికలాంగులు వినతిపత్రం అందించారు. వీరికి జిల్లా నాయకుడు గురువెల్లిరమణ. సమస్యలను వివరించగా సానుకూలంగా స్పందించారు. సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమములో టీడీపీ నాయకులు, వికలాంగ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## గొటివాడలో పాడైన బోరు



**జలుమూరు, అక్టోబర్ 28(వార్త):** జలుమూరు మండలం గొటివాడ గ్రామం ఎస్సీ కాలనీలో బోరు పనిచేయక ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు ఆవే దన వ్యక్తం చేస్తున్నారు. బోరు బాగుచేయాలని పంచాయతీ అధికారులకు తెలియ జేసినప్పటికీ పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు. బోరు బాగు చేయక తాగునీటికి, ఇంటి అవసరాలకు ప్రయాసలు పడాల్సి వస్తోందని ఆందోళన చెందు తున్నారు. తక్షణమే పంచాయతీ అధికారులు స్పందించి బోరు బాగుచేయాలని కోరుతున్నారు.

## బీమా ఏజెంట్ల నిరసన

**జలుమూరు, అక్టోబర్ 28(వార్త):** కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో కొనసాగుతున్న ఎల్ఐసీ పాలసీలపై జీఎస్టీ విధించడంపై స్థానిక సిబ్బందితో పాటు ఏజెంట్లు నిరసన వ్యక్తం చేశారు. సోమవారం నరసన్నపేట మండల ఎల్ఐసీ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ కార్యదర్శి ఉప్పాడ పూర్ణారావు మాట్లాడుతూ జీవిత బీమా వ్యవస్థలో ఇటువంటి ప్రక్రియ గతంలో ఎప్పుడూ లేదన్నారు. కార్యక్రమంలో ఎల్ఐసీ ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## వరి కోతలు ప్రారంభం

**జలుమూరు, అక్టోబర్ 28(వార్త):** సారవకోట మండలంలో అక్టోబర్ చివరి నాటికే వరి కోతలు ప్రారంభమ య్యాయి. వడ్డీన వలస, కొత్తూరు, ధర్మలక్ష్మి పురం తదితర గ్రామాల్లో వరి కోతలు యంత్రాలతో చేపడుతున్నారు. గతంలో కంటే ఈ ఏడాది వరి కోతలు త్వరగా చేపట్టారు. ప్రస్తుతం ఎకరాకు 30 నుంచి 35 బస్తాల వరకు దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు.





## సారాతో ఒకరి అరెస్టు

**వంగర, అక్టోబర్ 28(వార్త):** వంగర మండలంలోని సంగాం గ్రామంలో సారా అమ్ముతున్నట్లు సమాచారం అందడంతో ఎస్ఐ షేక్ శంకర్, సిబ్బందితో హుటా హుటీన ఆ గ్రామానికి చేరుకొని ఆ వ్యక్తిని పట్టుకున్నారు. ఆయన వద్ద నుంచి ఆరు లీటర్లు సారా స్వాధీనం చేసుకున్నారు. ఆయనను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఈ దాడిలో ఏఎస్ఐ ప్రసాద్, హెచ్‌సీ రామకృష్ణ, కానిస్టేబుల్ నరసింగరావు తదితరులు ఉన్నారు.

## చెక్‌డ్యామ్ నిర్మించరూ..?



**జలుమూరు, అక్టోబర్ 28(వార్త):** మండలం గొటివాడ గ్రామంలోని సీతన్న చెరువుకు చెక్ డ్యామ్ కట్టాలని స్థానిక రైతులు కోరుతున్నారు. సోమవారం వారు మాట్లాడుతూ చెక్‌డ్యామ్ లేక నీరు వృధాగా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో వ్యవసాయ సాగుకు ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి చెక్‌డ్యామ్ నిర్మాణం చేయాలని కోరుతున్నారు.


## 'ఉపాధ్యాయుల బోధన మెరుగుపడాలి'



**జలుమూరు, అక్టోబర్ 28(వార్త):** నరసన్నపేట మండలం కోమర్తి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సోమవారం మండల విద్యాశాఖ అధికారి పి. దాలినాయుడు సందర్శించారు. ఉపాధ్యాయుల బోధన మెరుగుపడే విధంగా తగు సూచనలు సలహాలు ఇచ్చారు. విద్యార్థులకు బోధించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేచర్ సేవ్ సొసైటీ ప్రతినిధికి సత్కారం

**జలుమూరు, అక్టోబర్ 28(వార్త):** నరసన్నపేటకు చెందిన ప్రముఖ స్వచ్ఛంద సంస్థ నేచర్ సేవ్ సొసైటీ ప్రతినిధి కోరుకొండ శాంతారావును శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకరరావు సన్మానించారు. శ్రీకాకుళం అంబేడ్కర్ ఆడిటోరియంలో పీకే ఎంటర్టైన్మెంట్ వారి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా జనసేన అధ్యక్షులు పిసిని చంద్రమోహన్, శ్రీకాకుళం బీజేపీ అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.




# పలాస దాడి బాధితులకు వైసీపీ నేతల పరామర్శ

**పలాస, అక్టోబర్ 28(వార్త) :** పలాసలో టీడీపీ నేతల దాడిలో గాయపడ్డ వైస్సార్సీపీ నాయకులను మాజీ స్పీకర్ తమ్మినేని, మాజీమంత్రి అప్పలరాజు సోమవారం పరామర్శించారు. తన అనుచరులు మొదలవలస మన్మథరావు, అల్లు రమణపై దాడిని ఖండిస్తూ వారిని పరామర్శించడానికి వెళ్తున్న అప్పలరాజును పోలీసులు గృహ నిర్బంధం చేశారు.

ఈ విషయం తెలుసుకున్న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, బాధి తులు పరామర్శించడానికి వచ్చి, అప్పలరాజుతో కలిసి మాజీ మంత్రి స్వగృహంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు.

అనంతరం బాధితుల ను పరార్శించడానికి మాజీ మంత్రితో కలిసి బయలుదేరగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో శాంతియుతంగా కలుస్తాం.. శాంతిభద్రతలకు ఎటువంటి ఆటంకం కలిగించమని వారు మాట ఇవ్వడంతో అనుమతి ఇచ్చారు. దీంతో బాధితుల ఇంటికి చేరుకొని పరామర్శించారు. దాడి ఎలా జరిగిందో అడిగి తెలుసుకున్నారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

వీరి వెంట మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, వైఎస్ఆర్సీపీ పట్టణ అధ్యక్షుడు సనపల సింహాచలం, సిస్టు గోపి, కొర్రాయి గోపి, ఉంగ సాయి, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



# 'హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం'

**పలాస, అక్టోబర్ 28(వార్త):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని మోదీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, కూటమిలో ఉన్న టీడీపీ, జనసేన పార్టీలు దీనిపై కనీన స్థాయిలో కూడా స్పందించడం లేదని సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆరోపించారు.

పలాస లోని ఓ ప్రైవేట్ కళ్యాణ మండపంలో సోమవారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. రాష్ట్రానికి మోదీ ప్రభు త్వం కనీసం నిధులు కేటాయించడం లేదని, గత పదేళ్లలో రాష్ట్రానికి ఎలా నిర్వీర్యం చేశారో నేడు అదే పరిస్థితి కొనసాగిస్తున్నారని ఆరోపించారు. దీంతో నిరుద్యోగులు వలసల బాట పడుతున్నారన్నారు. అమరావతి రుణం కూడా మనపై భారం వేయాలని చూస్తున్నప్పటికీ దీనికి కూడా చంద్రబాబు అంగీకారం తెలుపుతున్నా రన్నారు. టారిఫ్ పెంచకుండా విద్యుత్ చార్జీలు పెంచడానికి సిద్ధపడుతున్నా రని, దీంతో ప్రజలపై అదనపు భారం పడుతుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో 8 వేల కోట్ల అదనపు భారం పడగా నేడు 24 కోట్ల రూపాయలు అదనపు భారం పడే అవకాశాలు ఉన్నాయన్నారు. దీనిపై ఈ నెల 30న వామపక్ష పార్టీల సమావేశంలో ఉమ్మడి ప్రణాళిక రూపొందిస్తామన్నారు. ఉచిత ఇనుక అందిస్తామని చెప్పిన చంద్రబాబు ఇసుక విధానం మాఫియా గుప్పిటలోకి తీసుకు వెళ్లారని ఆరోపించారు. దీనిపై పోరాటానికి సిద్ధపడతామన్నారు. మద్యం విధానం ప్రైవేటుకు అప్పగించడంతో జనవాసాల్లో దుకాణాలు పెడుతున్నారని, మద్యం విధానంలో నాణ్యత గానీ, ధరల్లో గానీ ఎటువంటి మార్పు లేదని, పైగా బెల్ట్ షాపులు ఎక్కువై పోయాయని ఆరోపించారు. వీటిని నివారించకపోతే తీవ్రంగా ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బెండి తులసీదాస్ మాట్లాడుతూ జీడి, కొబ్బరి పంటలను ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని, పరి పరిశోధన కేంద్రాలు, జీడి బోర్డులు ఏర్పాటు చేస్తామని.. జగన్, చంద్రబాబు హామీ ఇచ్చినా నెరవేర్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జీడి, కొబ్బరి పంటలను అభివృద్ధి చేయడంతో పాటు కొనుగోలుకు అవకాశాలు కల్పించాలని, కేరళలో జీడి, కొబ్బరి పంటలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నా ఆంధ్రాలో మాత్రం ఈ పంటలను పట్టించుకోవడం లేదన్నారు. జీడి పరిశ్రమలను అభివృద్ధి చేయాలని, కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని కోరారు. గిరిజన ప్రాంతాలలో విద్య, వైద్యం వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

సీపీఎం జిల్లా కార్య దర్శి బి.గోవిందరావు మాట్లాడుతూ వచ్చే నెల 9, 10 తేదీలలో పలాస వేది కగా 18వ జిల్లా మహాసభలు నిర్వహించనున్నామని, వీటిని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఎం నాయకులు కోనారి మోహనరావు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.



# రెవెన్యూ సదస్సులతో భూ సమస్యల పరిష్కారం



**జలుమూరు, అక్టోబర్ 28(వార్త):** రెవెన్యూ సదస్సుల ద్వారా సత్వరమే భూ సమస్యలు పరిష్కారమవుతాయని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. జలుమూరు మండలం గుండువలస గ్రామంలో సోమవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. గతంలో భూములు రీ-సర్వే జరిగిన గ్రామాల్లో తప్పుగా నమోదు కాబడిన వాటిని సరి చేయడానికి ప్రభుత్వం ఈ సదస్సుల నిర్వహిస్తోందన్నారు. గతంలో భూములు రీ సర్వే జరిగిన సమయంలో భూములు విస్తీర్ణం పరంగా తేడా ఉంటే, వాటికి సంబంధించిన సరైన ఆధారాలతో దంఖాస్తు చేసుకోవాలని సూచించారు. రీసర్వేల తప్పుగా నమోదైన పేర్లను సరి చేస్తామని, రీసర్వేలో ఒకే రెవెన్యూ గ్రామ సంబంధించిన ఒకే వ్యక్తికి ఒకే ఖాతా కంటే ఎక్కువ ఖాతాలు ఇచ్చిన వాటిని ఒకే ఖాతాగా మార్చడం చేస్తారన్నారు. పట్టాదారుడు ఎవరైనా మరణిస్తే వారి భూమిని వారసులకు సరైన ఆధారాలతో మార్పు చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్, కూటమి ముఖ్య నాయకులు, అధికారులు, సచివాలయం సిబ్బంది, గ్రామ ప్రజలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## కార్తీక మాసానికి శ్రీముఖలింగం సిద్ధం

**జలుమూరు, అక్టోబర్ 28(వార్త):** ప్రముఖ పుణ్యక్షేత్రం, దక్షిణ కాశీగా పిలవబడుతున్న జలుమూరు మండలం శ్రీముఖలింగం లో కొలువైయున్న శ్రీ మధుకేశ్వర స్వామి కార్తీక మాసం పూజలు అందుకునేందుకు సిద్ధమయ్యారు. పలు ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు లేకుండా కార్య నిర్వాహణ అధికారి పి.ప్రభాకరరావు ఏర్పాట్లు చేస్తున్నారు.



# గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలి




**వంగర, అక్టోబర్ 28(వార్త) :** వంగర మండలంలోని అన్ని గ్రామాలను పరిశుభ్రంగా ఉండేటట్లు చర్యలు చేపట్టాలని ఎంపీపీ ఉత్తరావల్లి సురేష్ ముఖర్జీ పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. సోమవారం ఆయన మండలంలోని పంచాయతీ సెక్రటరీలతో ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. మండలంలోని 29 గ్రామ పంచాయతీల్లో గల 38 గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాల సందర్భంగా కాలువలు, పారిశుధ్యం మంచినీరు క్లోరినేషన్ చేసి అందించాలని కోరారు. ప్రజలకు పారిశుధ్యం పై ప్రత్యేక అవగాహన కల్పించాలని సూచించారు. సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎం, ఆశ వర్కర్లతో కలిపి ఇంటింటి సర్వే జరిపి ఎక్కడ జ్వరాలు, డయేరియా, చికెన్ గున్యా, మలేరియా తదితర వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. వారానికి ఒక పర్యాయం అన్ని గ్రామాల్లో దోమలు లేకుండా తప్పనిసరిగా బ్లీచింగ్ చల్లాలని ఆదేశించారు. ఎంపీడీవో లోపింటి త్రినాథ రావు మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో ప్రతి రోజూ ప్రజలకు క్లోరినేషన్ చేసిన నీటిని ఇవ్వాలని ఆదేశించారు. పంచాయతీ సెక్రటరీలు, సచివాలయ సిబ్బందితో ప్రతిరోజూ గ్రామాల్లో తిరిగి ఏయే గ్రామాల్లో పారిశుధ్య సమస్య లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈవోపీఆర్డీ కెల్ల రామారావు మాట్లాడుతూ అన్ని గ్రామ పంచాయతీలు పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రజలకు మరిగించి చల్లార్చిన నీటిని తాగమని దండోరా, ఆలయాల వద్ద ఉన్న మైకుల ద్వారా ప్రజలను చైతన్యవంతం చేయాలని కోరారు. అన్ని గ్రామ పంచాయతీల్లో తగినంత బ్లీచింగ్, సున్నం ఫినాయిల్ నిల్వ ఉంచుకొని ప్రతీ వారం చల్లించాలని కోరారు. అనంతరం మండల పరిషత్ నుంచి అన్ని గ్రామ పంచాయతీలకు బ్లీచింగ్, సున్నం బస్తాలు ఎంపీపీ సురేష్ ముఖర్జీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

**కొత్తూరు, అక్టోబర్ 28(వార్త):** పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని హిరమండలం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ప్రతినిధి గోగుల వర ప్రసాద్నాయుడు అన్నారు. సోమవారం ఆయన కుమార్తె లాస్యశ్రీ 11వ జన్మదినం సందర్భంగా తాను చదువుతున్న శ్రీ మహర్షి విద్యాలయ ప్రాంగణంలో ఓ కొబ్బరి మొక్కను ఆయన నాటారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణకు ప్రతి ఒక్కరూ పాటు పడాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ తమ పుట్టినరోజున ఓ మొక్కను నాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోగుల మాధవి, మహర్షి విద్యాలయ ప్రిన్సిపాల్ ముగితి రాంబాబు, లోతుగడ్డ కన్నబాబు, పెదకోట రామారావు, పిన్నింటి రామారావు నాయుడు, జడ్డు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# కార్యకర్తల సంక్షేమమే ధ్యేయం



**జలుమూరు, అక్టోబర్ 28(వార్త):** కార్యకర్తల సంక్షేమమే ధ్యేయమని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. సోమవారం ఆయన జలుమూరు మండలంలోని కరవంజ గ్రామంలో జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్ర మంలో పాల్గొని మాట్లాడారు. కార్య కర్తల సంక్షేమానికి తెలుగుదేశం పార్టీ అధిక ప్రాధాన్యత కల్పిస్తుం దన్నారు. కార్యకర్తల కుటుంబాలను ఆదుకోవడానికి రూ.5 లక్షల బీమా వర్తింపజేస్తున్నామన్నారు. మట్టి ఖర్చులకు రూ.10వేలు అందజేస్తున్నా మన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ నాయ కులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.



విలేఖరులతో మాట్లాడుతున్న ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్

## రెండు లారీలు, ఎక్స్కవేటర్ స్వాధీనం

**జలుమూరు, అక్టోబర్ 28(వార్త):** నరసన్నపేట మండలంలో కోమర్తి వద్ద అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న వాహనాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ తెలిపారు. ఇటీవల నరసన్నపేట మండలంలో ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలింపు అక్రమంగా జరుగుతోందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తున్న రెండు లారీలు, ఎక్స్కవేటర్ స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వాహనదారులు పరారీలో ఉన్నట్లు చెప్పారు.

## నేడు కొల్లివలసలో రెవెన్యూ సదస్సు

**పోలాకి, అక్టోబర్ 28(వార్త):** భూసమస్యలు పరిష్కరించేందుకు కొల్లివలసలో మంగళవారం రెవెన్యూ సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం తెలిపింది. ఉదయం 10 గంటలకు జరగనున్న సదస్సులో ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి పాల్గొంటారని పేర్కొంది. ఈ సదస్సును రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం దీర్ఘాశిలో జరగనున్న తెలుగుదేశం పార్టీ సభ్యత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారని పేర్కొన్నారు.

## పాఠశాల తనిఖీ



**వంగర, అక్టోబర్ 28(వార్త) :** కింజంగి ఎంపీపీఎస్ పాఠశాలను వార్షిక తనిఖీలో భాగంగా ఎంఈవో2 వై.దుర్గారావు సోమవారం సందర్శించారు. పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల బోధనను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం బి.రమేష్, సాదెం రాజేష్కుమార్, సత్యం, సహాయ ఉపాధ్యాయులు వై.రామకృష్ణ, ఎస్.రాజేష్ పాల్గొన్నారు

## నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు




**శ్రీకాకుళం, అక్టోబర్ 27(వార్త):** హెచ్పీసీఎల్ ఆధ్వర్యంలో నడుపుతున్న స్కిల్ డెవలప్మెంట్ ఇనిస్టిట్యూట్, బొల్లినేని మెడ్ స్కిల్స్ సంయుక్తంగా బ్యూటీషియన్, హోటల్ మేనేజ్మెంట్, జనరల్ డ్యూటీ అసిస్టెంట్ (నర్సింగ్), డేటా ఫీడర్, ప్రొడక్షన్ మిషన్ ఆపరేటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్టు బొల్లినేని మెడ్ స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు తెలిపారు. ఈ కోర్సులు విశాఖపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్లోని సెకండ్ ఫ్లోర్ లో ఉన్న స్కిల్ డెవల ప్మెంట్ ఇనిస్టిట్యూట్ నందు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కోర్సులు చేసేందుకు ఇంటర్, డిప్లమో, ఐటీఐ, పదో తరగతి పూర్తి చేసి, 18 నుంచి 28 ఏళ్లలోపు గల విద్యార్థినీ, విద్యార్థులు అర్హులన్నారు. ఈ మూడు నెలలు అనుభవజ్ఞులైన అధ్యాపకులతో శిక్షణ, ఉచిత భోజన, వసతి, యూనిఫామ్, బుక్స్, ఎ.సి క్యాంపస్ వంటి సదుపాయం కల్పిస్తున్నామన్నారు. శిక్షణ పూర్తయిన వెంటనే ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి గల వారు వివరాలకు తమ సంస్థ నందు లేదా 9121999654, 7993011695 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## సీఎం పర్యటనకు స్థల పరిశీలన

**కంచిలి, అక్టోబరు 28 (వార్త):** సీఎం చంద్రబాబు వచ్చేనెల 1న ఇచ్ఛాపురం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఈ మేరకు సభా వేదిక, హెలీప్యాడ్ కోసం ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వరరెడ్డి, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ నియోజకవర్గంలో పర్యటించారు. సోంపేట మండలం కొర్లాం పంచాయతీ గొనకపాడు, బారువ రైల్వే గేట్ సమీపంలోని స్థలాలను, కంచిలి మండలం పద్మతుల గ్రామ సమీపంలో స్థలాన్ని కూడా పరిశీలన చేశారు. వీటితోపాటు ఇచ్ఛాపురం మండలం ఈదుపురం వద్ద స్థలాన్ని పరిశీలించారు. సీఎం పర్యటన ఏర్పాట్లపై చర్చించారు. కార్యక్రమంలో పలాస ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, సోంపేట, కంచిలి, ఇచ్ఛాపురం తహసీల్దార్‌లు అప్పలస్వామి, రమేష్‌కుమార్, వెంకటరావు, సీఐలు బి.మంగరాజు, చిన్నంనాయుడు, ఎస్ఐలు చంద్రశేఖర్, జి.రాజేష్, ఈ.శ్రీనివాసరావు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# రక్తదాతలు.. ప్రాణదాతలు

**శ్రీకాకుళం, అక్టోబర్28 (వార్త):** పోలీసు సిబ్బంది చేసిన రక్తదానం అత్యవసర పరిస్థితులు వేరే వ్యక్తి ప్రాణాలు కాపాడ డానికి ఉపయోగపడుతుందని, రక్తదాతలే ప్రాణ దాతలు అని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి అన్నారు. అమరవీరుల స్మారక ఉత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీకాకుళం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ సిబ్బంది వారి కుటుంబ సభ్యులకు మెడికవర్ హాస్పిటల్ సౌజన్యంతో మెగా ఉచిత వైద్య శిబిరం, రిమ్స్ గవర్నమెంట్ హాస్పిటల్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదానం శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాలను కలెక్టర్, ఎస్పీతో పాటు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్ ప్రారంభించారు. రక్తదాతలకు బ్లడ్ డొనేషన్ ధ్రువీకరణ పత్రాలతో పాటు, రెడ్ క్రాస్ పతకాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పోలీసు సిబ్బంది ప్రతి ఒక్కరు ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. ఇటువంటి ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకొని ఆరోగ్య పరీక్షలు చేసుకోవాలని సూచించారు. జిల్లాలో అక్టోబర్ 21 తేదీ నుంచి జరుగుతున్న అమరవీరుల స్మారక ఉత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ సిబ్బంది కొరకు మెగా ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరాలను నిర్వహించడం జరిగిందని, ఇవి చాలా మంచి కార్యక్రమాలని తెలిపారు. రక్తదానం వలన అత్యవసర పరిస్థితులులో ఇంకొకరి ప్రాణాలు నిలబెట్టేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పోలీస్ సిబ్బందితో పాటు యువత, విద్యార్థులు ప్రజలు ఇలాంటి కార్యక్రమంలో స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. ఒకసారి రక్తదానం చేసినట్టు ధ్రువీకరణ పత్రం పొందినట్లయితే అత్యవసర సమయంలో ఆయా సర్టిఫికెట్ ఆధారంగా రక్త నిల్వకేంద్రం నుంచి రక్తాన్ని అవసరం మేరకు అందజేస్తారని తెలిపారు. అమరవీరుల స్మారక ఉత్సవాలు ఈనెల 31వ తేదీ వరకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. టెక్కలి, కాశీబుగ్గ సబ్ డివిజన్ పరిధిలో ఈనెల 29, 30 తేదీల్లో ఈ వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు నిర్వహించనున్నామన్నారు. ఈ అమరవీరుల స్మారక ఉత్సవాల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజలకు సైబర్ నేరాలు, యాంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రస్తుత కాలంలో





- * పోలీస్ సిబ్బంది ఆరోగ్యంపై దృష్టి సారించాలి
- * స్వచ్ఛంద రక్తదానికి ముందుకురావాలి
- * యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండండి
- * ఈనెల 31 వరకూ అమరవీరుల స్మారక ఉత్సవాలు
- * జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి
- * పెద్ద ఎత్తున మెగా ఉచిత, రక్తదాన శిబిరాలు

జరుగుతున్న సైబర్ నేరాలు గురించి క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. అనధికార వ్యక్తులు, సంస్థలకు వ్యక్తిగతమైన వివరాలు, బ్యాంకు ఖాతా వివరాలు తెలపరాదన్నారు. మాదక ద్రవ్యాలు వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలు గురించి పోలీసు అధికారులు, సిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం సబ్ డివిజన్ డీఎస్పీలు సీహెచ్ వివేకానంద, ఎల్.శేషాద్రి, సీఐలు అవతారం, ఉమామహేశ్వరరావు, సత్యనారాయణ, సూర్యనారాయణ, రెడ్ క్రాస్ చైర్మన్ బి.జగన్మోహనరావు, ప్రతినిధులు చైతన్య కుమార్, మెడికవర్ హాస్పిటల్ వైద్యులు డా.సూర్యప్రకాష్, రంగనాథ్, శ్రీనివాస్, మురళీ కృష్ణ, రిమ్స్ హాస్పిటల్ వైద్యాధికారులు, ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

### ఆర్ట్స్ కళాశాల మైదానంలో...

# బాణసంచా విక్రయ షాపులు

**శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 28 (వార్త):** దీపావళి ఈ నెల 31న ఉండడంతో బాణసంచా విక్రయాలకు అధికార పక్షానికి చెందిన కొందరు షాపుల లైసెన్సుల కోసం పెద్ద ఎత్తున జిల్లా ఉన్నతాధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. శ్రీకాకుళం రెవెన్యూ డివిజన్‌కు సంబంధించి 59 మంది దరఖాస్తు చేసుకోగా, శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానంలో షాపుల ఏర్పాటుకు 23 మంది దరఖాస్తులను ఇచ్చారు. కొందరు తమకే షాపుల వస్తాయన్న ధీమాతో ఇప్పటికే ఇతర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున బాణసంచా సామగ్రిని లారీలు, ఇతర వాహనాల్లో జిల్లాకు తెప్పించేశారు. అవి ఎవరి కంట పడకుండా రహస్యంగా ఉంచారు. శ్రీకాకుళం నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో షాపులు ఏర్పాటు చేస్తున్నారు. ఉన్నతాధికారులు కళాశాల మైదానానికి చేరుకుని ఎక్కడెక్కడ షాపులు ఏర్పాటు చేయాలని మార్కింగ్ ఇచ్చినప్పటికీ కొందరు మాత్రం తమకు నచ్చిన విధంగా షాపులను ఏర్పాటు చేశారు. కనీస నిబంధనలు పాటించలేదు. దీన్ని తెలుసుకున్న ఆర్డీవో సిబ్బందితో కలిసి షాపులు ఏర్పాటు చేసే ప్రాంతాన్ని పరిశీలించారు. నిబంధనలు మేరకు షాపులు ఏర్పాటు చేసేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బాణసంచా షాపులు ఏర్పాటు చేసే విషయంలో ఎటువంటి నిబంధనలు పాటించాలన్న దానిపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మార్గదర్శకాలు జారీ చేశారు. బాణసంచా సామగ్రి విక్రయించే షాపులు ఒకదానికొకటి 50 మీటర్ల దూరంలో ఏర్పాటు చేయాలని, ఒకదానికి మరొకటి ఎదురుగా ఉండకూడదని, ఆయిల్ బర్నింగ్ ల్యాంప్స్, గ్యాస్ ల్యాంప్‌లు, నేక్డ్ లైట్లు షెడ్‌లో ఏర్పాటు చేయకూడదన్నారు. ఒక క్లస్టర్‌లో, ప్రత్యేకంగా బహిరంగ ప్రదేశంలో ఇరవై కంటే ఎక్కువ దుకాణాలను అనుమతించకూడదని, శాశ్వత పటాకుల దుకాణాల నుంచి దాదాపు 3 కిలోమీటర్ల పరిధిలో తాత్కాలిక పటాకుల దుకాణాలను అనుమతించకూడదని ఆదేశాలు జారీ చేశారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే తాత్కాలిక లైసెన్స్ వెంటనే రద్దు చేస్తామని హెచ్చరికలు జారీ చేశారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## మినీ ఉద్యోగ మేళాకు మెగా స్పందన

**పలాస,అక్టోబర్ 28(వార్త):** రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి శాఖ సంయుక్తంగా పలాస స్థానిక డాక్టర్ వి కణితి విశ్వనాధం ఐటిఐ కళాశాల ఆవరణలో సోమవారం మినీ జాబ్ మేళా నిర్వహించారు.182 మంది ఇంటర్వ్యూలకు హాజరుకాగా అందులో 65మంది వివిధ కంపెనీలకు ఎంపిక య్యారు. ఎంపికైన వారిని ఉద్దేశించి ప్రిన్సిపాల్ పి.జవహర్ , జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి వంశీకృష్ణ మాట్లాడుతూ గతంలో అభ్యర్థులు కంపెనీల చుట్టూ తిరు గుతూ ఉద్యోగాలు కోసం నిరీక్షణ చేయాల్సి వచ్చేదని, ఇప్పుడు నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కంపెనీలే మనవద్దకు వచ్చి వారికి కావాల్సిన అభ్యర్థులను ఎంపిక చేసుకుంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ట్రైనింగ్ ఆఫీసర్ రవి కుమార్, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ సోమేశ్వరరావు, తేజేశ్వరరావు, వివిధ కంపెనీల ప్రతినిధులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



## డీఆర్వోగా వెంకటేశ్వరరావు బాధ్యతల స్వీకరణ

**శ్రీకాకుళం, అక్టోబర్ 28 (వార్త):** జిల్లా రెవెన్యూ అధికారిగా మారెళ్ల వెంకటేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు. వెంకటేశ్వరరావు 2014-19 మధ్య టెక్కలి ఆర్డీవోగా పనిచేసి, బదిలీపై రంపచోడవరంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేశారు. గతంలో పలాస, ఇచ్ఛాపురం, పోలాకి మండలాలలో వివిధ స్థాయిలలో పనిచేశారు. డిప్యూటీ కలెక్టర్ గా పదోన్నతి సాధించిన తర్వాత ఫారెస్ట్ సెటిల్మెంట్ ఆఫీసర్ గా, కే ఆర్ ఆర్ సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గా కూడా శ్రీకాకుళం జిల్లాలో పనిచేశారు. జిల్లా రెవెన్యూ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా పలువురు ఉద్యోగులు ఆయనకి శుభాకాంక్షలు తెలియజేశారు.

## వైభవంగా ఆదిత్యుని కల్యాణం



**అరసవల్లి, అక్టోబరు28 (వార్త):** ప్రత్యక్ష దైవం ఆరోగ్య ప్రదాత సూర్యనారాయణ స్వామికి ఆశ్వీయుజ బహుళ ఏకాదశి పురస్కరించుకొని సోమవారం ఆలయ ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకర శర్మ ఆధ్వర్యంలో కల్యా ణోత్సవం నిర్వహించారు. వేదమంత్రోచ్ఛారణ, మంగళ వాయిద్యాల నడుమ స్వామి ఆలయ అర్చకులు కల్యాణం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వై.భద్రాజీ, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే శ్రీకాకుళం, జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వరరావు స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు.

## కార్యకర్తల జోలికి వస్తే ఖబడ్దార్
### మాజీ మంత్రి శివాజీ

**పలాస, అక్టోబరు 28 (వార్త):** టీడీపీ కార్యకర్తల జోలికి వస్తే సహించేది లేదని, ఒక చెంపపై కొడితే రెండో చెంపపై మా కార్యకర్తలు కొడతారని మాజీ మంత్రి గౌతు శివాజీ అన్నారు. మా కార్యకర్తల జోలికి వస్తే ఖబడ్దార్ అని హెచ్చరించారు. సోమవారం పలాసలో ఆయన మీడియాతో మాట్లాడుతూ గత ఐదేళ్లుగా అప్పలరాజు సెటిల్మెంట్ రారాజుగా పేరుగాంచారని, కొండలు ప్రభుత్వ భూములు కబ్జా చేశారని, పలాస ఎమ్మెల్యే తన కుమార్తె అయిన శిరీషపై ఫేక్ వీడియోలు పెడుతున్నారని, ఇంతకాలం సహిస్తూ వచ్చానని ఇక ఏమాత్రం సహించేదే లేదన్నారు. ఫేక్ వీడియోలపై పోలీసు ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేసి, అనంతరం ఆ ఫేక్ వీడియోలు పెట్టిన వారి ఇంటికి వెళ్లి నిలదీస్తానన్నారు. రేపటి నుంచే ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. సమావేశంలో నాయకులు వజ్జ బాబురావు, బడ్డ నాగరాజు, లోడగల కామేష్, పీరుకట్ల విఠల్, మల్ల శ్రీనివాసరావు, చంద్రశేఖర్ త్యాడి, గురిటి సూర్యనారాయణ, సవర రాంబాబు, గాలి కృష్ణారావు, అంబటి కృష్ణమూర్తి, సప్ప నవీన్ పాల్గొన్నారు.



# యూనిఫామ్ తీసేసి..
# టీడీపీ కార్యకర్తలుగా చేరండి

*** ఫిర్యాదుకు వెళ్లిన వైసీపీ కార్యకర్తపై టీడీపీ నేతల దాడి * తిరిగి మా కార్యకర్తలపైనే కేసులా * పోలీసులు అధికార పార్టీ తొత్తులుగా ఉండాలనుకుంటున్నారా? * ఇకనైనా మేల్కొనాలి.. చట్టబద్ధంగా వ్యవహరించాలి * లేకపోతే పలాస పోలీసు స్టేషన్‌కు పసుపు రంగు వేస్తాం * అక్కడ టీడీపీ నేతలకే అనుమతి అని బోర్డు పెడతాం * వైసీపీ నేతలు సీదిరి అప్పలరాజు, తమ్మినేని సీతారాం**

**పలాస/శ్రీకాకుళం, అక్టోబరు 28 (వార్త):** కూటమి ప్రభుత్వ నాలుగు నెలల పాలనలోనే రాష్ట్రంలో శాంతిభద్రతలకు తీవ్ర విఘాతం కలిగింది.. మహిళలకు ఏమాత్రం రక్షణ లేకుండా పోయింది.. మరోవైపు పోలీసులు కూడా తమ బాధ్యతను విస్మరిస్తున్నారు.. అని వైసీపీ సీనియర్ నేతలు, మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం ధ్వజమెత్తారు. పోలీసులు ఇకనైనా మేల్కొని, చట్టబద్దంగా వ్యవహరించకపోతే చూస్తూ ఊర్కోబోమని వారు హెచ్చరించారు. సోమవారం పలాసలో వారు మీడియాతో మాట్లాడుతూ పలాసలో మైనర్ బాలికలపై అత్యాచార ఘటనలపై ఫిర్యాదు కోసం పోలీస్‌స్టేషన్ వెళ్తే, అక్కడ టీడీపీ నాయకులు వైయస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడి చేశారని, చోద్యం చూసిన పోలీసులు కనీసం వారిని అడ్డుకోలేదన్నారు. పైగా తమ పార్టీ కార్యకర్తలపై పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. పోలీసులు అధికార పార్టీ తొత్తులుగా ఉండాలనుకుంటే, వెంటనే యూనిఫామ్ తీసేసి, టీడీపీలో చేరాలన్నారు. పలాస పోలీసులు తమ వైఖరి మార్చుకోకపోతే, పోలీస్ స్టేషన్‌కు పసుపు రంగు వేస్తామని, అక్కడ కేవలం టీడీపీ నాయకులకు మాత్రమే అనుమతి అని బోర్డు కూడా పెడతామని వెల్లడించారు. పలాస స్టేషన్‌లోనే తమ కార్యకర్తలపై టీడీపీ నాయకులు దాడి చేస్తే, పోలీసులు కనీస చర్యలు ఎందుకు తీసుకోలేదో జిల్లా ఎస్పీ సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేశారు. వీటన్నింటినీ ప్రశ్నిస్తే తన ఇంటి చుట్టూ 50 మంది పోలీసులను కాపలా పెట్టి, తనను గృహ నిర్బంధం చేశారని సీదిరి అప్పలరాజు ధ్వజమెత్తారు. పోలీసులు మేల్కొని ఇకనైనా కేసుల విషయంలో పునరాలోచన చేయాలని, టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన తమ కార్యకర్తలను పరామర్శించడానికి అనుమతి ఇవ్వాలని కోరారు. వాటాలు, కమిషన్ల కక్కుర్తితో నిర్మాణంలో ఉన్న మూడు పోర్టులను ప్రైవేటీకరించే ప్రయత్నం చేస్తున్నారన్న డాక్టర్ సీదిరి అప్పలరాజు విమర్శించారు. మచిలీపట్నం, మూలపేట, రామాయపట్నం పోర్టుల ప్రైవేటీకరణ కోసం నియమ, నిబంధనలు మార్చారని ఆయన దుయ్యబట్టారు. 'చెల్లి పెళ్లి మళ్లీ మళ్లీ జరగాలి అన్నట్లు.. ఇప్పటికే జరుగుతున్న పోర్టు పనులను మంత్రి అచ్చెన్నాయుడు మళ్లీ ప్రారంభిస్తారట'.. అని ఎద్దేవా చేశారు. మూలపేట పోర్టు కోసం జిల్లా రైతులు భూములిచ్చి త్యాగం చేస్తే, దాన్ని అమ్మేయాలన్న నిర్ణయం సరికాదని.. హార్బర్లు, పోర్టుల జోలికొస్తే మత్స్యకారులంతా రోడ్డు మీదకు వస్తారని డాక్టర్ సీదిరి అప్పలరాజు హెచ్చరించారు. వైయస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను ఎంత వేధించినా సరే, భయపడేది లేదని.. తిరిగి లేచి నిలబడి పోరాడతామని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం స్పష్టం చేశారు. శ్రీకాకుళం జిల్లా పోలీసులు తమ వైఖరి, విధానాలను మార్చుకోకపోతే, ఒక్క పలాస పీఎస్ మాత్రమే కాకుండా.. జిల్లాలోని అన్ని పీఎస్‌లకు పసుపు రంగు వేస్తామని ఆయన ప్రకటించారు. బాధితుల పక్షాన వినతిపత్రం ఇస్తామంటే కలెక్టర్, ఎస్పీ ఎందుకు అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని ప్రశ్నించారు. అలా ఎంత కాలం సాగదీస్తారని నిలదీశారు. బాధితుల పరామర్శకు వెంటనే అనుమతి ఇవ్వాలని, లేకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని మాజీ స్పీకర్ హెచ్చరించారు.



## త్వరితగతిన అర్జీలను పరిష్కరించాలి

*** జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు**



**శ్రీకాకుళం, అక్టోబర్ 28 (వార్త):** ప్రజలు సంతృప్తి చెందేలా, త్వరితగతిన అర్జీలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర రావు అన్నారు. సోమవారం ఉదయం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) మీకోసం కార్యక్రమం జిల్లా రెవెన్యూ అధికారి అధ్యక్షతన జరిగింది. 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి 142 అర్జీలను డీఆర్వోతో పాటు జిల్లా పరిషత్ సీఈఓ శ్రీధర్ రాజు, ఉప కలెక్టర్ అప్పారావులు స్వీకరించారు. అనంతరం డీఆర్వో మాట్లాడుతూ ప్రతి అర్జీని సంబంధిత ప్రధాన అధికారులు వ్యక్తిగతంగా పరిశీలించి ఎండార్స్ మెంట్ ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అమలుచేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, రెవెన్యూ, పౌర సరఫరాల సేవలు, ఇళ్ల మంజూరు, పెన్షన్లు, సర్వే, ఉపాధి అవకాశాలు, భూ వివాదాలు తదితరాలకు సంబంధించి సమస్యలను అర్జీల రూపంలో వచ్చాయని తెలిపారు. అనంతరం 15 మందికి కారుణ్య నియామకాలలో భాగంగా నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మీకోసం ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక కార్యక్రమం జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి డా.బి.మీనాక్షి, డిసిహెచ్ఎస్ డా.కళ్యాణ్ బాబు, డ్వామా పిడి సుధాకర్, ఐసిడిఎస్ పిడి శాంతిశ్రీ, జిల్లా ఉద్యాన అధికారి ఆర్.వరప్రసాద్, డిఆర్డిఏ, విద్యాశాఖ, విద్యుత్, ల్యాండ్ సర్వే, పోలీసు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### జిల్లా పోలీసు కార్యాలయంలో..

జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదులు స్వీకరణ, పరిష్కార కార్యక్రమంలో 48 ఫిర్యాదులు అందాయని డీఎస్పీ సీహెచ్ వివేకానంద తెలిపారు. అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.పౌర సంబంధాల అంశాలపై 5 ఫిర్యాదులు, మిస్సింగ్ కేసులపై 3, మోసపూరితమైనవి 5, కుటుంబ తగాదాలపై 8, పాత ఫిర్యాదులు 15, ఇతర అంశాలపై 12 ఫిర్యాదులను స్వీకరించారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## అంతర్ కళాశాల క్రీడా పోటీలు ప్రారంభం

**శ్రీకాకుళం స్పోర్ట్స్, అక్టోబరు28 (వార్త):** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వ విద్యాలయం అనుబంధ కళాశాలల క్రీడా పోటీలు శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పురుషులు) ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ అధ్యక్షతన సోమవారం ప్రారంభ మయ్యాయి. ఈ సందర్భంగా ఆమె క్రీడాకారులను ఉద్దే శించి మాట్లాడుతూ చదువు తోపాటు క్రీడల్లో రాణించడం ద్వారా మంచి భవి ష్యత్తు లభిస్తుందన్నారు. కార్య క్రమంలో డీఎస్‌డీవో జగన్మోహనరావు, యూని వర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి ఎం.శ్రీనివాసరావు, కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇంచార్జ్ బి.మోహనరావు, ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్. హరిత, పీడీ జ్యోతి కుమార్ పాల్గొన్నారు.



# పలాసలో రెడ్‌బుక్.. రాజ్యాంగం



* దాడులు దౌర్జన్యాలే లక్ష్యంగా పాలన
* నిన్నటి తతంగమే తాజా నిదర్శనం
* పోలీస్ స్టేషన్లోనే వైకాపా కార్యకర్తలపై పిడుగుద్దులు
* దౌర్జన్య కారులపై కేసులు కట్టాలి
* లేకుంటే పలాస పోలీస్ స్టేషన్ ముట్టడిస్తాం
* మాజీమంత్రి అప్పలరాజు గృహనిర్బంధం అమానుషం
* దీపావళి కానుకగా విద్యుత్ చార్జీల పెంపు
* విద్యుత్ చార్జీల బాదుడే... బాదుడు..!
* సంపద ఇలాగే సృష్టించేదా బాబూ..!!
* కూటమి ప్రభుత్వంలో సామాన్యులకు షాక్
* 2600 కోట్ల భారంతో ఉచిత గ్యాస్ సిలిండర్లు
* 6070 కోట్లతో ప్రజలపై విద్యుత్ వినియోగ భారం
* విద్యుత్ చార్జీలు పెంచబోమని ఎన్నికల్లో హామీ
* మరోసారి బయటపడిన బాబు నైజం
* సంక్షేమ పథకాలు లేక ఇప్పటికే ఇబ్బందులు
* ఆపై విద్యుత్ చార్జీల వాతలు
* ఘోరంగా విఫలమైన కూటమి ప్రభుత్వం
* శాసనమండలి సభ్యులు నర్తు రామారావు

**కంచిలి, అక్టోబర్ 28 (వార్త):** మాజీమంత్రి సీదిరి అప్పలరాజును గృహనిర్బంధించడాన్ని శాసనమండలి సభ్యులు రామారావు తీవ్రంగా ఖండించారు. ఒక ప్రణాళిక ప్రకారం వైసీపీ కార్యకర్తలను వేధిస్తున్నారని, మాపైనే భౌతిక దాడులకు దిగుతూ తిరిగి మా కార్యకర్తలపైనే అక్రమంగా కేసులు బనాయిస్తున్నారని ఎమ్మెల్సీ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో సోమవారం మాట్లాడారు. నిన్న పలాసలో జరిగిన సంఘటన తీవ్ర భయాందోళనలను రేకెత్తించిందన్నారు. సాక్షాత్తు పోలీస్ స్టేషన్ లోనే, పోలీసుల సమక్షంలోనే పిడుగుద్దులను గుద్దుతూ వైఎస్ఆర్సిపి నాయకుల పైకి దౌర్జన్యం చేసిన సంఘటన సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా బహిర్గతమైందని అన్నారు. ఆ దృశ్యాలను చూసిన వారు ఎవరైనా, ఆ సంఘటనను ఖండించాల్సిందే అంటూ తెలిపారు. ఈ విధంగా కూటమి పాలన రాష్ట్రంలో నడుస్తోంది అంటూ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మూడు పార్టీలు కలిసి చక్కటి పాలనను అందిస్తారని ప్రజలు అవకాశం ఇస్తే... వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులను లక్ష్యంగా చేసుకొని దాడులకు పాల్పడుతూ, మహిళలు బాలికలపై అఘాయిత్యాలు చేస్తూ, శాంతి భద్రతలను క్షీణింపచేసి.. రౌడీయిజం ద్వారా రెడ్ బుక్ పాలనను పోలీసుల ద్వారా అమలు చేపిస్తున్నారని తీవ్రంగా ఆరోపించారు. పలాస ఘటనలో వైసిపి శ్రేణులపై దాడులకు పాల్పడిన వ్యక్తులను తక్షణమే అరెస్టు చేయాలని, లేనిపక్షంలో జిల్లా నాయకత్వంతో కలిసి పోలీస్ స్టేషన్ ను ముట్టడిస్తామని శాసనమండలి సభ్యులు నర్తు రామారావు తీవ్రంగా హెచ్చరించారు.

### దీపావళి కానుకగా విద్యుత్ చార్జీల మోత

సామాన్య ప్రజలకు దీపావళి కానుకగా, విద్యుత్ చార్జీలను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం గొప్ప గిఫ్ట్ ఇచ్చిందని స్థానిక సంస్థల శాసనమండలి సభ్యులు నర్తు రామారావు ఎద్దేవా చేశారు. సంపద సృష్టించి ప్రజలకి పంచి పెడతానని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన చంద్రబాబు, ప్రజల కాయ కష్టం దోచుకునేందుకు సన్నద్ధమయ్యారని అన్నారు. ఇప్పటికే నిత్యవసరాల ధరలు ఆకాశాన్ని తాకిన నేపథ్యంలో తాజాగా విద్యుత్ వినియోగ చార్జీలను పెంచుకునే అవకాశాన్ని డిస్కం లకు ఆమోదం తెలిపి పండగకు గొప్ప బహుమతిని రాష్ట్ర ప్రజలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిందని ఎటకారం చేశారు. దీపం పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ ప్రకటన చేస్తూనే, రాష్ట్ర ప్రజలపై 6070 కోట్లు విద్యుత్ వినియోగ భారాన్ని మోపుతూ కనికరం లేకుండా కరెంట్ షాక్ కు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక చేతితో ఏడాదికి మూడు ఉచిత సిలిండర్ల పంపిణీ దీపావళి నుంచి చేస్తామని చెబుతూ... ఆ దీపావళికి బోనస్ గా ప్రభుత్వం మరో చేతితో సామాన్యుల శ్రమను దోచుకునేందుకు సిద్ధమైంది. ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీలను పెంచబోమంటూ, ఎన్నో ప్రకటనలను గుప్పించిన చంద్రబాబు అధికారం లోకి వచ్చి నాలుగు నెలలు అవగానే తన నిజస్వరూపాన్ని చూపించారని తీవ్రస్థాయిలో రామారావు విమర్శించారు. గడిచిన ఆరు మాసాలుగా సంక్షేమ పథకాలు అందక లబ్ధిదారులు ఎన్నో అవస్థలు పడుతున్నారని, ఇటువంటి పరిస్థితులలో వారిని ఆదుకోవాల్సింది పోయి మరింత ఆర్థిక భారాన్ని వారిపై పెట్టారని అన్నారు. మేనిఫెస్టో లో ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా, ఎన్నికల్లో ఇచ్చిన ప్రకటనలు కూడా అమలు చేయకపోవడం ద్వారా చంద్రబాబు బుద్ధి బహిర్గతమైందని తెలిపారు. పాలనలో కూటమి ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను అందుకోలేక ఘోరంగా విఫలమైందని చెప్పారు. అప్పటివరకు కొనసాగుతున్న సంక్షేమ పథకాలకు అదనంగా, సూపర్ సిక్స్ ద్వారా మరిన్ని పథకాలను అందిస్తామని హామీలు గుప్పించడంతో, ప్రజలు ఎన్డీఏ ప్రభుత్వానికి మద్దతు పలికినట్టు ఎమ్మెల్సీ అన్నారు. ఎన్డీఏ ప్రభుత్వానికి మద్దతు తెలిపే తమకంటిని తమ చేతి వేలితోనే పొడుచు కున్నట్టు తమ వద్ద పలువురు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్టు తెలిపారు. ప్రజల్లో పాలనపై వ్యతిరేకత వస్తున్న నేపథ్యంలో వారి దృష్టిని మరలించేందుకు చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ ను తమ అనుకూల మీడియా ద్వారా ప్రయోగిస్తున్నట్టు ఎమ్మెల్సీ ఆరోపించారు.



Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:016413